సమస్యల వలయంలో సర్కారు బడులు!

- ఇంకా పూర్తి కాని అభివృద్ధి పనులు
- రేపే పునఃప్రారంభం
- కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత
- కానరాని మౌలిక వసతులు

సికింద్రాబాద్ ప్రాంతంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు ఇంకా సమస్యల వలయంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలోనూ లాలాపేట, తార్నాక, అడ్డగుట్ట ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు నేటికీ అందుబాటులోకి రాలేదు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా ఇప్పటికే చేపట్టిన పలు అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు టాయిలెట్లు అందుబాటులోకి రాలేదు, దాదాపు అన్ని పాఠశాలల్లో డ్రైనేజీ లైన్ల నిర్మాణం, తాగునీటి వసతి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. తరగతి గదుల మరమ్మతు, విద్యుత్ సరఫరా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. –సికింద్రాబాద్/అడ్డగుట్ట/లాలాపేట/సనత్‌నగర్

500 మంది విద్యార్థులు..5 మంది టీచర్లు

సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని ఏడాది క్రితం నేలమట్టం చేశారు. అధునాతన భవనం నిర్మాణం పేరిట ఇక్కడి పాఠశాల భవనాన్ని నేలమట్టం చేసినా కొత్త భవనం నిర్మాణం పనులు బేస్‌మెంట్‌తోనే ఆగిపోయాయి. ఈ పాఠశాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలోని ఓయూ మోడల్ స్కూల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రెండు పాఠశాలల తరగతులు ఒకే భవనంలో కొనసాగుతుండడం విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. మనబడి పథకం కింద ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్లు డ్రైనేజీ లైన్ల నిర్మాణ పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడి పాఠశాల భవనం చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణం కూడా చేయిస్తున్నారు. మారేడుపల్లి మండల కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లాలాగూడ నెం. 1 పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. సుమారు 500 మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలో కేవలం ఐదుగురు మాత్రమే టీచర్లు ఉన్నారు.

రెండు వారాల్లో పనులు పూర్తి: డీప్యూటీ డీఈఓ

పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సోమవారం మారేడుపల్లి జోన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బాలునాయక్ లాలాపేట గడి స్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారేడుపల్లి మండలం పరిధిలో మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని ఇందులో మన బస్తీ మన బడి పథకం కింద కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల వసతుల కోసం అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కొన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు తుదిదశకు చేరాయని, ఇంకొన్ని పాఠశాలల్లో మరో రెండు వారాల్లో పనులు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. మండలంలో ప్రస్తుత విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు.

సనత్‌నగర్ నియోజకవర్గంలో..

బేగంపేట పాటిగడ్డ ప్రాంతంలోని బండిమెట్ స్కూల్‌లో ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఈ పాఠశాల ప్రాంగణంలో బోర్ ఉన్నప్పటికీ మోటార్ పాడైపోవడంతో జలమండలి సరఫరా చేసే నీటి పైనే ఆధార పడాల్సిన పరిస్థితి ఉంది. ఆ నీరు విద్యార్థులకు ఏమాత్రం సరిపోవు. వెంటనే మోటారు బాగు చేయాల్సిన అవసరం ఉంది.

- సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను గతంలో మనబస్తీ–మనబడి కార్యక్రమం ద్వారా ఎంపిక చేసినా పెద్దగా పనులేమీ చేయలేదు. ముఖ్యంగా టాయిలెట్స్, మరుగుదొడ్ల పరిస్థితి అసలే బాగలేదు. వీటిని తొలగించి కొత్త వాటిని నిర్మించాలని గతంలో ప్రతిపాదించినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. పాఠశాలలు పునః ప్రారంభమైతే మాత్రం మూత్రశాలల సమస్య ఇక్కడి విద్యార్థులను వెంటాడక తప్పని పరిస్థితి. ఇక్కడ అదనపు గదుల సమస్య ఎన్నాళ్ల నుంచో వెంటాడుతోంది. ప్రస్తుతం ఉన్న భవనంపై అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని గతంలో నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు.
- బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. పాఠశాలల పునః పారంభం రోజున విద్యార్థులకు ఇక్కడి సమస్యలు స్వాగతం పలకనున్నాయి. పాఠశాల ప్రవేశ ద్వారం వద్దనే భవన నిర్మాణ వ్యర్థాలు డంప్ చేసి ఉండడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోక తప్పని పరిస్థితి. ఇక సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సిందే.
- నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. టాయిలెట్లు సగం పనులు పూర్తవ్వగా, మంచినీళ్ల పనులు 60 శాతం, రిపేర్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. విద్యుత్ పనులు పూర్తయ్యాయి. ప్రాథమిక పాఠశాలలో 5 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది.


బేగంపేట పాటిగడ్డలోని బండిమెట్ ప్రభుత్వ పాఠశాలలో ఇంకా కొనసాగుతున్న పనులు



ఏసీఎస్ నగర్‌లోని పాఠశాలలో కొనసాగుతున్న టాయిలెట్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు


ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ పాఠశాల ప్రవేశద్వారం వద్ద భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్

ఎమ్మెల్యే కార్యాలయం నుంచే ప్రభుత్వ సేవలు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ఎప్పటి మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ నియోజకవర్గ ప్రజలకు సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారానే అందిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వం మారినంత మాత్రాన తమ కార్యాలయం నుంచి అందే సేవలకు ఎలాంటి ఆటంకం ఉండదన్నారు. సోమవారం ముషీరాబాద్ మండల పరిధిలోని 82 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాజకీయలకు అతీతంగా అన్ని రకాల సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు తమ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రభుత్వంలోనూ అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించేందుకు అదే వ్యవస్థను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మారేడుపల్లి తహసీల్దార్ పద్మాసుందరి, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, లింగాని లక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

సికింద్రాబాద్: త్వరలో జరగనున్న బక్రీద్ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం నామాలగుండు బీఎస్‌ఆర్ గార్డెన్‌లో బక్రీద్ వేడుకలు పురస్కరించుకుని మైత్రీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. చిలకలగూడ డివిజన్ పరిధిలోని వారాసీగూడ, చిలకలగూడ, లాలాగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సుమారు వంద మంది మైత్రీ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అన్ని పండగలు, పర్వదినాలను శాంతియుతంగా జరుపుకొని మత సామరస్యాన్ని పాటించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత ఇన్‌స్పెక్టర్లు సైదులు, అనుదీప్, రమేశ్‌గౌడ్ పలువురు పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి హుండీని లెక్కించగా రూ.23,91,023 ఆదాయం వచ్చినట్లు ఈవో గుత్త మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం దేవాదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో హుండీని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రామేశ్వర్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



సనత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందిన మల్లురవికి కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. జెక్‌కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్‌తో కలిసి సోమవారం మల్లు రవి నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు.. అధికారులు పట్టించుకోరు!

అమీర్‌పేట: అమీర్‌పేటలోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని బాటసారులు వాపోతున్నారు. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అమీర్‌పేట మైత్రీవనం, ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీహాల్ నుంచి బీకేగూడ వార్డు కార్యాలయం వెళ్లే మార్గం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఏకంగా ఫుట్‌పాత్‌పైనే స్టాల్స్ వెలిసిపోయాయి. ఎస్‌ఆర్‌నగర్ బల్కంపేట వేంకటేశ్వర దేవాలయం రోడ్డులో వ్యాపారులు ఏర్పాటు చేసిన హోటల్స్ వద్ద పార్కింగ్ సౌకర్యం లేని కారణంగా అక్కడికి వచ్చే వ్యక్తులు వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్న కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మధ్యాహ్నం, రాత్రి సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ పక్కలైన్‌లో ఫుట్‌పాత్‌లు వ్యాపారులకు అడ్డాగా మారాయి. ఓ ప్రజాప్రతినిధి కార్యాలయం ఎదురుగానే అక్రమంగా వ్యాపార కార్యకలాపాలు సాగుతున్నా పట్టించుకోకపోవడంపై ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

'నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి'

కాచిగూడ: నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, మళ్లీ ఎగ్జామ్ నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన రావాల్సిన నీట్ ఫలితాలను ఎన్నికల రిజల్ట్స్ రోజున హడావిడిగా విడుదల చేశారని ఆరోపించారు. నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 67 మంది ఫస్ట్ ర్యాంక్ సాధించారని, వారిలో మొత్తం 720 గాను 719, 718 మార్కులు సాధించారని, నీట్ చరిత్రలో ఇలాంటి ఫలితాలు ఎప్పుడు రాలేదన్నారు. అంతేగాకుండా ఒకే సెంటర్ నుంచి 8 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని, ఎగ్జామ్ నిర్వహణలో జరిగిన లోపాలకు ఇదే నిదర్శనమన్నారు. టెక్నికల్ సమస్యల వలన పరీక్షను లేట్‌గా నిర్వహించి, నిర్ణత సమయంలోనే పరీక్ష ముగించారని, దీంతో సమయం కోల్పోయిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. హడావిడిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధిత విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలుపుతామని ప్రకటించారని, దీని వలన మెరిట్ స్టూడెంట్స్ తీవ్రంగా నష్టపోయారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పై సీబీఐ విచారణ జరిపించాలని లేకుంటే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఆందోళనలు చేపడుతామని చేస్తామని ఆయన హెచ్చరించారు.



సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ సంజీవ్‌గాంధీనగర్‌లోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. చిన్న పాటి వర్షానికి గుంతల్లో నీరు చేరి రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు కాగా క్రింద రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.కానీ.. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. రోడ్డు పనులు చేపట్టడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.దీనికి తోడు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఎన్నికల కోడ్ ముగియడంతో ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –అమీర్‌పేట

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.45, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 23, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 85, గింజ బీక్కుడు 65, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 28, రూట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

విద్యాశాఖ మంత్రి, వీసీలను నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యాశాఖ మంత్రితో పాటు యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను తక్షణం నియమించాలని తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బారి అశోక్‌కుమార్ యాదవ్, వడ్డె గణేష్ డిమాండ్ చేశారు. విద్యా సంస్థలు ప్రారంభం, విద్యార్థుల ప్రవేశాలు, ఫీజుల నిర్ణయం సమయంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం దారుణమన్నారు. విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారుల చేతిలో పాలన వ్యవహారాలు నత్తనడక కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలకు ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నీట్ అవకతవకలపై బీఆర్‌ఎస్వీ మండిపాటు

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ అవకతవకలపై బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య సోమవారం మండిపడ్డారు. వ్యయప్రయాసాలకు ఓర్చి తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులు కష్టపడి చదివి నీట్ పరీక్ష రాస్తే అందులో అక్రమాలు జరగడం దుర్మార్గమన్నారు. ప్రవేశ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి బాధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరగాలంటే మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం


మహ్మద్ షాబాజ్


లాలాపేట: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన మహ్మద్ షాబాజ్ (26) ఈ నెల 7న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధిలో కలిసి సాగుదాం

బోర్డు సీఈఓతో ఎమ్మెల్యే శ్రీగణేశ్ భేటీ


ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు అధికారుల సమన్వయంతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యేగా కాకముందు సైతం పలు సమస్యల విషయంలో సీఈఓను కలిశానని, ప్రస్తుతం ఆయా సమస్యల పరిష్కారం దిశగా ఇద్దరం కలిసి పనిచేస్తామన్నారు. గత పాలకుల మాదిరిగా తాను కేవలం మాటలకే పరిమితం కాకుండా, దశలవారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గానికి రాష్ట్రం నుంచి రావాల్సిన అన్ని రకాల నిధులు సకాలంలో విడుదలయ్యేలా చూస్తానని తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం ఢిల్లీ వరకు అయినా వెళ్లి పోరాడుతానని అన్నారు. స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్‌ఎన్‌డీపీ) పనులను కంటోన్మెంట్‌లో చేపట్టడం లేదని సీఈఓ తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. తక్షణమే ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఎస్‌ఎన్‌డీపీ పనులను కంటోన్మెంట్‌లోనూ కొనసాగించాలని కోరుతామన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజల అవసరాలకు సరిపడే అదనపు మంచినీటి విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కనెక్షన్ చార్జిల పేరిట రూ.24 కోట్లు కోరుతున్న విషయం కూడా తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలోనూ బోర్డు అధికారులతో పాటు సీఎంను కలిసి, అదనపు చార్జిల భారం లేకుండానే నీటి విడుదల చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు.


నూతన కమిటీ సభ్యులతో పీఎల్ శ్రీనివాస్

నూతన కమిటీ ఎన్నిక

రసూల్‌పురా: సికింద్రాబాద్ టివోలి రోడ్‌లోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం ఇండియన్ స్కౌట్, గైడ్స్ ఫెలోషిప్ రెండో ప్రత్యేక అసెంబ్లీ సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీఆర్ సిద్ధాంతి కళాశాలల వ్యవస్థాపకులు పీఎల్. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సభ్యులను ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా మక్ మెక్కి, నేషనల్ కౌన్సిల్ సభ్యురాలు వాణి, రాష్ట్ర అధ్యక్షుడు మలయాద్రి, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షురాలిగా అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ వనజ, కోశాధికారిగా బీఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శి జూహి, జనరల్ సెక్రెటరిగా సీమ రాథి, జాయింట్ సెక్రటరిగా థెరిస్సా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళల గిల్డ్ సభ్యురాలు డాక్టర్ నూరి మెహ్రున్నిసా, మల్కాజ్‌గిరి సభ్యులు భాస్కర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పిఎల్. శ్రీనివాస్ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



వేప పుల్లలతో దంతాలు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

లాలాపేట: నేటి సమాజంలో నగరంలో ఎక్కడ చూసినా కాంక్రీట్ జంగిలే దర్శనమిస్తోంది.చాలా మంది సహజమైన వాతావరణానికి దూరమవుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు, యువత సాఫ్ట్‌వేరు ఉద్యోగాలు, ఏసీ గదుల్లో ఉంటూ కంప్యూటర్లు, ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లతో గడుపుతూ స్వచ్ఛమైన ప్రకృతి ఎంటో తెలియని దుస్థితి నెలకొంది. దీంతో చిన్నతనం నుంచే అనేక రుగ్మతులకు లోనవుతున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తార్నాకకు చెందిన కొందరు విద్యార్థులు గత కొన్ని రోజుల నుంచి ఉస్మానియా యూనివర్సిటీలోని పచ్చని ప్రకృతి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఆక్సిజన్ పార్క్‌లో సేద తీరుతూ రోజూ పచ్చందాల నడుమ కాలినడక సాగిస్తున్నారు. పూర్వం దంతాలు శుభ్రం చేసుకునే వేపపుల్ల అంటే నేటి తరానికి తెలియదు. అలాంటి వేపపుల్లతో దంతాలను తోముకుంటూ బ్యాక్ టూ రూట్స్ అంటూ ప్రకృతి సందేశాన్ని ఇస్తున్నారు.

రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలి


సుద్దాల సురేష్

లాలాపేట: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న ఆర్టీసి బహుజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ఒక్కరోజు రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించి గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను వెంటనే అమలు చేయాలన్నారు. విలీనం అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలన్నారు. మహాలక్ష్మీ పథకంతో ఆధార్ కార్డు వల్ల కండక్టర్లకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఆధార్ కార్డుకు బదులుగా ఆర్టీసీ ఐడీకార్డు ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు.

ర్యాంకులపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ర్యాంకులపై తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, నాగరాజు నారాయణ, శ్రీచైతన్య కాలేజీల నిర్వాహకులను హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మొదటి ర్యాంకు తమదంటే.. తమదని పోటీపడి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మోసపూరిత ప్రకటనలతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షితులు చేసి ప్రవేశాలు పొందుతున్న విద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రులకు అభినందనలు


బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేకల సారంగపాణి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న దీపిక

సికింద్రాబాద్: తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన పార్లమెంట్ సభ్యులను మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి సోమవారం అభినందనలు తెలిపారు. పలువురు బీజేపీ నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లిన ఆయన కేంద్ర మంత్రులు జీ.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు కింజరపు రామ్మోహన్‌నాయుడిని కలిసి అభినందనలు తెలిపారు.

రాంగోపాల్‌పేట్: కేంద్ర మంత్రులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం బీజేపీ నాయకులు నరేష్‌తో కలిసి ఆమె ఢిల్లీలో వారిని కలిసి అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు సాగుతూ వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు.

శంకర్‌యాదవ్ సేవలు చిరస్మరణీయం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ కూరగాయల వర్తకుల సంఘం అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మోండా మార్కెట్‌లో శంకర్‌యాదవ్ సేవలు చిరస్మరణీయమన్నారు. అన్నా అంటే నేనున్నానంటూ ఎంతో మంది పేదలు, వ్యాపారులకు శంకర్ యాదవ్ అండగా ఉన్నారని మోండా మార్కెట్ కూరగాయల వర్తకుల సంఘం ప్రధాన కార్యదర్శి కోత్మీర్ మధు, అలెగ్జాండర్(అలెక్స్), జాన్, కె. రాజు, దాస్, ప్రవీణ్, కేఎం రామ్ పేర్కొన్నారు.